సాక్షి ఆదిలాబాద్

బుధవారం | 11 | జూన్ | 2025



హాకీ చాంపియన్‌గా 'హైదరాబాద్'

జిల్లా కేంద్రంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల విజేతగా హైదరాబాద్ జట్టు నిలిచింది. 8లో▸



'బెస్ట్ స్కూళ్ల'లో ప్రవేశాలు

ఎస్సీ విద్యార్థులకు ప్రైవేట్‌లో ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

చదువుతోనే ఆదివాసీల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

భీంపూర్: చదువుతోనే ఆదివాసీల అభివృద్ధి సాధ్యమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మండలంలోని గుబిడి, టెకిడి రాంపూర్, కరంజి, భగవాన్‌పూర్‌లో మంగళవారం పర్యటించారు. రోడ్డు సౌకర్యం సరిగా లేని మారుమూల గ్రామాలకు స్వయంగా తానే బైకు నడుపుతూ చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా పోలీసులు ప్రజలతో మమేకమై సేవలందిస్తున్నారన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా 87126 59953 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. అనంతరం యువకులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఆయన వెంట డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సాయినాథ్, ఎస్సై పీర్‌సింగ్ నాయక్, గ్రామ పెద్దలు, సిబ్బంది ఉన్నారు.

నేరాల నియంత్రణకు 'సబ్‌కంట్రోల్'

ఆదిలాబాద్‌టౌన్: నేరాల నియంత్రణకు పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌లు దోహద పడతాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో ఏర్పాటు చేసిన సబ్ కంట్రోల్ రూమ్‌ను మంగళవారం ప్రారంభించారు. మార్కెట్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుందని, ప్రజలకు తక్షణ సహాయార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, నేరాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దోహద పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సునిల్‌కుమార్, కరుణాకర్‌రావు, మున్సిపల్ డీఈ కార్తీక్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రాంచంద్రరావు, సత్యనారాయణ, సురేష్, శ్రీధర్, ఉప్పల్ పాల్గొన్నారు.


రిమ్స్‌లో మెరుగైన వైద్యసేవలు



'క్రిటికల్ కేర్'ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌ను పరిశీలించారు. కేంద్రం రూ.23 కోట్ల నిధులతో ఈ పనులు చేపడుతుందని పేర్కొన్నారు. జిల్లాకు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రధాని మోదీ అందించారని తెలిపారు. ఆస్పత్రి నిర్మాణానికి సహకరిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి ప్రారంభోత్సవానికి కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ఆహ్వానిస్తామన్నారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన



డీపీవో కార్యాలయ ఉద్యోగికి వినతి అందజేస్తూ..

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు కలెక్టరేట్‌లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఏవో వర్ణ, డీపీవో కార్యాలయ ఉద్యోగి కల్పనకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులు వెంటనే క్లియర్ చేయాలన్నారు. అలాగే కార్యదర్శుల ఆన్‌లైన్ హాజరు నమోదు కోసం తెచ్చిన ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్‌ను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే సామూహిక సెలవుపై వెళతామని స్పష్టం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: న్యాయశాస్త్ర పట్టభద్రులకు మూడేళ్ల పాటు న్యాయ పరిపాలనలో శిక్షణకు సంబంధించి అర్హులైన ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దళితాభివృద్ధి శాఖ అధికారి సునితకుమారి ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణ సమయంలో నెలకు రూ.3వేలు భృతి, న్యాయశాస్త్ర గ్రంథాలు, ఫర్నీచర్ కొనుగోలుకురూ.50వేలు ఒకేసారి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత గల వారు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: డీఎడ్‌లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుంది. ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో మంగళవారం 850 మంది సర్టిఫికెట్లు పరిశీలించాల్సి ఉండగా, 620 మంది హాజరైనట్లు డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు.

పల్లెకు దారేది!

- అస్తవ్యస్తంగా గ్రామీణ రోడ్లు
- చినుకు పడిందంటే చిత్తడే
- ఏజెన్సీలో మరింత అధ్వానం
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బందుల్లో పల్లెవాసులు



ఇంద్రవెల్లి మండలంలోని ఆదివాసీ గ్రామమైన చిత్తబట్టకు వెళ్లాలంటే ఈ వాగును దాటాల్సిందే. చిన్నపాటి వర్షానికే ఇది పొంగి ప్రవహించడంతో ఏటా వర్షాకాలంలో రెండు ఆదివాసీ గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరమవుతారు. గర్భిణులు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లడం కష్టతరంగా మారుతోంది. గౌరాపూర్ పంచాయతీ పరిధిలోకి వచ్చే ఈ గ్రామానికి వెళ్లేందుకు ఏళ్లుగా మట్టి రోడ్డే దిక్కవుతోంది. వంతెన నిర్మించాలని ఆదివాసీలు వేడుకుంటున్నా పాలకులు పట్టించుకోకపోవడం గమనార్హం.



సాక్షి ఫోకస్

చిన్నపాటి వర్షానికే బురదమయమై నడవడానికి వీల్లేకుండా మారిన బోథ్ మండలంలోని చింతగూడకు వెళ్లే దారి పరిస్థితి ఇది. అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి. చినుకు పడిందంటే చాలు తమ గోస వర్ణనాతీతం అంటూ వాపోతున్నారు స్థానికులు. చింతగూడ నుంచి మార్లపెల్లి వరకు దాదాపు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇది కొత్తగా ఏర్పడిన సాత్నాల మండలంలోని పిప్పల్‌గావ్ రోడ్డు దుస్థితి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే మోకాల్లోతు గుంతలతో బురదమయంగా మారింది. పిప్పల్‌గావ్ నుంచి మేడిగూడ వరకు తొమ్మిది కిలోమీటర్ల వరకు ఇదే పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కాదు కదా కనీసం ఆటో, ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని దుస్థితి. ఏటా వానాకాలం వచ్చిందంటే ఆయా గ్రామాల ప్రజలకు దారి ఇక్కట్లు షరా మామూలే అన్నట్లుగా మారుతున్నాయి.

కైలాస్‌నగర్: శాస్త్ర, సాంకేతికరంగం అభివృద్ధి పథాన దూసుకెళ్తున్నా పల్లె రోడ్లు మాత్రం మెరుగుపడని పరిస్థితి. చాలా గ్రామాలకు ఇంకా మట్టి రోడ్లే దిక్కవుతున్నాయి. చిన్నపాటి వర్షానికే అవి బురదమయంగా మారుతున్నాయి. అడుగుకో గుంత అన్న చందంగా దర్శనమిస్తున్నాయి. అస్తవ్యస్తంగా మారిన ఈ దారులపై ప్రయాణం నరకప్రాయమే అవుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సైతం వెళ్లలేని దుస్థితి. ఏళ్లుగా ప్రజలు దారి ఇక్కట్లు ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం.

అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి

గ్రామాలను మండల, జిల్లా కేంద్రాలకు అనుసంధానిస్తూ ప్రభుత్వాలు బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నప్పటికీ జిల్లాలో ఇంకా అనేక గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం గమనార్హం. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు దాటినా ఇంకా మట్టి రోడ్లపైనే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని గిరి గ్రామాల పరిస్థితి దయనీయంగా ఉంది.

రోడ్డు సౌకర్యం లేని గ్రామాలివే...

- జిల్లాలో బోథ్, ఖానాపూర్ రెండు నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే సిరికొండ మండలంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. బోథ్ నియోజకవర్గ పరిధిలోని ఐదు గ్రామాలకు, ఖానాపూర్ నియోజకవర్గంలోని 47 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.
- ఇచ్చోడ మండలంలోని బావూజీపేట, గుండి గ్రామాలకు సరైన రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలకు ఎడ్లబండే దిక్కవుతుంది.
- నేరడిగొండ మండలంలోని సేవాదాస్‌నగర్, దంశతండా, బేల మండలంలోని రాయ్‌పూర్(కే), రాయ్‌పూర్ తండా, తలాయిగూడ, సాత్నాల మండంలోని దేవిజీగూడ, జంబుల్దరి గ్రామాలకు పక్కా రహదారి కరువైంది.
- గుడిహత్నూర్ మండలంలో పాత సోమర్‌పేట్ నుంచి న్యూ సోమర్‌పేట్ గ్రామానికి వర్షాకాలంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది.
- బజార్‌హత్నూర్ మండలంలోని డెడ్రా, గిరిజయి, మాన్కాపూర్, ఉమార్డ, చిన్నుమియాతండా, రాజుల గూడ, రతన్‌గూడ, కొత్తపల్లి గ్రామాలకు మట్టి రోడ్లే దిక్కు.
- బోథ్ మండలంలో సూర్జాపూర్, పాత కరత్వాడ, జైనూర్ పల్లె, రాంనగర్, సొనాల మండలంలో పెద్ద గూడ, లెండిగూడ, మామిడిగూడ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక తిప్పలు తప్పడం లేదు.
- ఇంద్రవెల్లి మండలంలోని గోపాలపూర్, గోపాల్‌పూర్ గూడ, చిత్తబట్ట, మామిడిగూడ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. అలాగే ఈ మార్గంలో వాగుల వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వర్షాకాలంలో ఊరుదాటి బయటకు రాలేని పరిస్థితి ఉంది.
- సాత్నాల మండలంలో అడ్డగుట్ట, సోనేరావుగూడ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు కాలినడకనే దిక్కవుతోంది.

63 పనులకు ప్రతిపాదనలు పంపించాం

జిల్లాలోని బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాలతో పాటు ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే ఆయా మండలాల్లోని 28 గ్రామాలను కటాఫ్ గ్రామాలుగా గుర్తించాం. వాటి పరిధిలోని రోడ్లు, వంతెనల మరమ్మతుల కోసం 63 పనులకుగాను రూ.98.75 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం. నిధులు విడుదలైన వెంటనే ఆయా గ్రామాల్లో పనులు చేపడుతాం.

– రాథోడ్ శివరాం, పీఆర్ ఈఈ

అంతా అతలాకుతలం

- గాలివాన బీభత్సం.. విద్యుత్‌శాఖకు తీవ్ర నష్టం
- జిల్లాలో విరిగిపడ్డ 236 స్తంభాలు
- ఎగిరిపడిన రేకులు, నేలకూలిన వృక్షాలు
- 18 గంటలు నిలిచిన కరెంట్ సరఫరా
- ఇబ్బందులు పడ్డ జనం



ఆదిలాబాద్‌లో ఈదురుగాలులకు చెల్లాచెదురైన ఎగ్జిబిషన్ రేకులు

ఆదిలాబాద్‌టౌన్: గాలివాన బీభత్సం జిల్లాను అతలాకుతలం చేసింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు ఈదురుగాలులతో మొదలైన భారీ వర్షం రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఉరుములు, పిడుగులతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. జిల్లాలో 236 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. కరెంట్ తీగలు తెగిపడడంతో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు 18 గంటల పాటు కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రంతా జాగరణ తప్పని పరిస్థితి. విద్యుత్ శాఖ అధికారులు వర్షం తగ్గిన తర్వాత మరమ్మతు చర్యలు చేపట్టినప్పటికీ విద్యుత్ సరఫరా జరగలేదు. అర్ధరాత్రి 12 గంటలకు కొన్నిచోట్ల సరఫరా అయినప్పటికీ, గంటలోపే మళ్లీ నిలిచిపోయింది. ఈ కారణంగా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాకు బ్రేక్ పడింది.

విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం

ఆదిలాబాద్ అర్బన్‌తో పాటు ఉట్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, జైనథ్ తదితర మండలాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 236 వరకు విద్యుత్ స్తంభాలు విరిగిపడినట్లు ఆ శాఖ అధికారులు వెల్లడించారు. సుమారు రూ.కోటి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఉట్నూర్‌లో నాలుగు, ఇచ్చోడలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. జైనథ్ మండలంలో 125విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. చాలా చోట్ల కరెంట్ తీగలు తెగిపడ్డాయి. భీంపూర్ మండలంలోని అర్లి(టి) నుంచి వడూర్ వెళ్లే రహదారిలో 17 విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. 33కేవీ సరఫరా నిలిచిపోవడంతో అధికారులు మంగళవారం మధ్యాహ్నం వరకు 11కేవీ ద్వారా సరఫరా పునరుద్ధరించారు. ప్రస్తుతం తాత్కాలికంగా సరఫరా చేస్తున్నారు. చాలాచోట్ల స్తంభాలను ఇంకా సరిచేయాల్సి ఉంది. జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్‌కు వెళ్లే దారిలో 20 స్తంభాలు నేలకొరిగాయి. ఆ గ్రామంలో ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. భారీ ఈదురుగాలులతో 32కేవీ సమస్యలు తలెత్తాయి. ఆదిలాబాద్ పట్టణంలో 10 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మావల మండలంలోని కేఆర్‌కే నుంచి బాలాజీనగర్‌కు వెళ్లే దారిలో ఎనిమిది స్తంభాలు పడిపోయాయి. దుర్గానగర్ దారిలో కరెంటు తీగలు తెగిపడ్డాయి. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో నీలగిరి చెట్లు పడిపోవడంతో పట్టణంలోని కైలాస్‌నగర్, మావల ఫీడర్, ఖానాపూర్ ఫీడర్ సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇన్సులేటర్లు లాస్‌ఓవరై పగిలిపోయాయి. పలుచోట్ల పిడుగులు పడడంతో విద్యుత్ సమస్య తలెత్తింది. ఆదిలాబాద్ పట్టణంలోని సీసీఐ సబ్‌స్టేషన్ నుంచి ఇతర మండలాలకు సరఫరా చేసే 133 కేవీ ఇన్సులేటర్లు చెడిపోవడంతో అంతరాయం ఏర్పడింది. అయితే ఇంకా ఎక్కడైనా విద్యుత్ సమస్య ఉంటే 1912 టోల్‌ఫ్రీ, 8712481799కు సమాచారం ఇవ్వాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ తెలిపారు. ఇదిలా ఉండగా పలు గ్రామాల్లో పూరిగుడిసెల పైకప్పు, రేకుల షెడ్లు గాలి బీభత్సానికి ఎగిరిపడ్డాయి. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ రేకులు, ఫ్లెక్సీలు నేలవాలాయి. ఎగ్జిబిషన్ ఆనవాళ్లు లేకుండాపోయాయి.

రోడ్లపై చెట్ల తొలగింపు పనులు..

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలో పలు చోట్ల రోడ్లపై చెట్లు పడిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు బల్దియా సిబ్బంది సహకారంతో వాటి తొలగింపు పనులు చేపట్టారు. బొక్కల్‌గూడలో ఓ ఇంటికప్పు ఎగిరిపడగా, మహాలక్ష్మివాడలో అంగన్‌వాడీ టీచర్ కిరణ్ సింగ్ ఇంటిపైకప్పు రేకులు 250 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డాయి.

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట సమీపంలోని విజయలక్ష్మీ జిన్నింగ్ మిల్లు షెడ్డు రేకులు ఈదురుగాలులకు కొట్టుకుపోయాయి. తుమ్మగూడ గ్రామానికి చెందిన కాత్లే సంగీత కాలుపై రేకులు పడడంతో గాయమైంది.

బోథ్: విద్యుత్ వైర్లు పడి బోథ్ మండలం మర్లపెల్లి గ్రామానికి చెందిన సిరిసె దీపేందర్‌కు చెందిన గేదె మృతి చెందింది.



కేఆర్‌కే కాలనీలో ఆటోపై పడ్డ విద్యుత్ స్తంభం



జిల్లాకేంద్రంలో ఎగిరిపోయిన ఓ ఇంటి పైకప్పు



విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న సిబ్బంది

ఏ శాఖ ఇస్తరో..!

ఏడాదిన్నరగా ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రిమండలిలో ప్రాతినిధ్యం లేక ప్రజలు, నాయకులు, అధికారులకు పరిపాలనలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. తాజాగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రివర్గంలో చోటుతో ఊరట దక్కింది. మరోవైపు రాష్ట్రం ఏర్పడ్డాక, తూర్పు జిల్లా నుంచి తొలిసారిగా మంత్రి పదవి లభించింది. గత ప్రభుత్వంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం ఉండగా.. ఈసారి మంచిర్యాల జిల్లాకు అవకాశం వచ్చింది.

- మంత్రి వివేక్‌కు పోర్ట్‌ఫోలియోపై చర్చ
- కేటాయింపుపై కొనసాగుతున్న కసరత్తు
- ఉమ్మడి జిల్లాకు 'ఇన్‌చార్జి' కానున్న వైనం

సాక్షిప్రతినిధి, మంచిర్యాల: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పరిపాలన తదితరవన్నీ జిల్లాకు మంత్రి లేకపోవడంతో జాప్యం అవుతోంది. ప్రస్తుతం అన్ని పథకాల అమలులో ఇన్‌చార్జి మంత్రి కీలకం. ఉమ్మడి జిల్లాకు ప్రస్తుతం మంత్రి సీతక్క కొనసాగుతున్నారు. జిల్లాల వారీగా అభివృద్ధి, పథకాల అమలుపై సమీక్షలు, సమావేశాలు, నియోజకవర్గాల వారీగా పర్యటనలు చేయాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇకపై వివేక్ ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. దీంతో పథకాల అమలు, అభివృద్ధి పర్యవేక్షణలో సులువు కానుంది. ప్రభుత్వ పరంగా వేడుకలు, అధికారిక కార్యక్రమాలు మంత్రి హోదాలో జరగనున్నాయి.

శాఖలపై కసరత్తు

రెండో విడతలో మంత్రులుగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ ప్రమాణం స్వీకారం చేశారు. వీరికి శాఖలు కేటాయించాల్సి ఉంది. మంత్రి మండలిలో ఖాళీగా హోం, మున్సిపల్, గనులు, కార్మిక, పశుసంవర్ధక, పాడి, సంక్షేమం, ఇతర శాఖలు ఖాళీగా ఉండడంతోపాటు రెండేసి, మూడేసి శాఖలు నిర్వహిస్తున్న మంత్రులు ఉన్నారు. ఈ క్రమంలో కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న వారికి ఎవరికి ఏ శాఖ ఇస్తారోనని ఆసక్తి నెలకొంది. ఇప్పటికే పార్టీ అధిష్టానం దీని పై కసరత్తు చేస్తుండగా,త్వరలోనే స్పష్టత రానుంది.

వివేక్‌పైనే ఆశలు

17 నెలలుగా ఉమ్మడి జిల్లా నుంచి మంత్రిగా లేకపోవడంతో నాయకులతోపాటు ప్రజలకు లోటు ఏర్పడింది.కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో నలుగురిలో ఒకరికైనా మంత్రి పదవి వస్తుందని ముందు నుంచి ప్రచారం ఉంది. అయితే పలుమార్లు వాయిదా పడింది. తాజాగా వివేక్‌కే అమాత్య యోగం దక్కడంతో ఆయనపై ఉమ్మడి జిల్లా వాసుల్లో ఆశలు నెలకొన్నాయి. తన నియోజకవర్గం చెన్నూరుతోపాటు మిగతా ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉంది. విద్య, వైద్యం, ఆరోగ్యం, గిరిజన ప్రాంతాలు, సింగరేణి తదితర అనేక సమస్యలు ఉన్నాయి.



మంగళవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ

సీఎంను కలిసిన మంత్రి, ఎంపీలు

చెన్నూర్: రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించిన అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు.

హస్తం.. ఫోకస్

- ఇక కాంగ్రెస్ జిల్లా కమిటీలు
- నెలాఖరులో డీసీసీ అధ్యక్షుడి ఖరారు
- ఉమ్మడి జిల్లా ఆధారంగా సామాజిక సమీకరణాలు
- అంతకుముందే మండల, బ్లాక్ కమిటీలు

సాక్షి, ఆదిలాబాద్: కాంగ్రెస్ జిల్లా కమిటీ, డీసీసీ అధ్యక్షుడి ఖరారు ఈ నెల చివరిలోగా పూర్తి చేయనున్నట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. గత నెలలోనే అన్ని మండలాలతో పాటు పట్టణంలో సమావేశాలు పూర్తి చేసిన హస్తం పార్టీ ఆ నెల చివరిలోనే కమిటీలు ఖరారు పూర్తి చేస్తామని తొలుత వెల్లడించింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ సమావేశాలు పూర్తి కాకపోవడం, ఇతర అంశాల కారణంగా ఆలస్యమైనట్లు ముఖ్య నేతలు పేర్కొంటున్నారు. ఈ నెల మూడో వారం వరకు మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు మొదట ఖరారు కానున్నాయి. చివరిలో జిల్లా అధ్యక్షుడిని నియమించనున్నారు. ప్రస్తుతం రాష్ట్ర కమిటీ పూర్తి కావడంతో పార్టీ అధిష్టానం ఇక జిల్లా కమిటీలపై దృష్టి సారించింది.

సామాజిక న్యాయానికి పెద్దపీట..

రాష్ట్ర కమిటీలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన పార్టీ అధిష్టానం జిల్లా కమిటీల ఎంపికలో నూ అదే విధానం అవలంబించనున్నట్లు ముఖ్య నేతలు చెబుతున్నారు. డీసీసీ అధ్యక్షుల నియామకం ఉమ్మడి జిల్లాలో సామాజిక సమీకరణాల ఆధారంగా ఉంటుందని పేర్కొంటున్నారు.ఎస్టీ,బీసీ, వెల్మ, రెడ్డి సామాజిక వర్గాల వారిని జిల్లా అధ్యక్షులుగా నియమించాలని భావిస్తున్నట్లు పార్టీలో ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ నుంచి ఈనెల చివరిలో పరిశీలకులు జిల్లాకు రానున్నారు. వారే ఉమ్మడి జిల్లాలో అధ్యక్షుల నియామకాన్ని చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పార్టీలో జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనేది ఆసక్తి కలిగిస్తుంది. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో డీసీసీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. నిర్మల్‌లో శ్రీహరిరావు, కుమురంభీంలో విశ్వప్రసాద్, మంచిర్యాలలో సురేఖ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ఈ ముగ్గురు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మాత్రం ఉమ్మడి జిల్లాలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేయాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు..

టీపీసీసీ కార్యవర్గాన్ని ఏఐసీసీ సోమవారం ప్రకటించింది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి సామాజిక సమీకరణాల ఆధారంగా ఏడుగురికి చోటు కల్పించారు. గతపార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి హస్తం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్రం సుగుణకు రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా చోటు దక్కింది. అలాగే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు, సీనియర్ నాయకుడు నరేశ్‌జాదవ్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చోటు లభించింది.

క్లుప్తంగా

అప్పు చెల్లించనందుకు కట్టేసి కొట్టారు

భీమిని: కన్నెపల్లి మండలంలోని నాయకునిపేట గ్రామపంచాయతీకి చెందిన హన్మంత్‌పై అదే గ్రామానికి చెందిన జింకమోర్ల నానయ్య కుటుంబసభ్యులతో కలిసి దాడి చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంత్ అదే గ్రామానికి చెందిన జింకమోర్ల నానయ్య వద్ద రూ.2.30లక్షలు అప్పుగా తీసుకున్నాడు. హన్మంత్ సోమవారం రాత్రి నాయకునిపేట వద్ద బస్సు దిగి ఇంటికి వెళ్తున్న సమయంలో నానయ్య బైక్‌పై వచ్చి అప్పు ఎప్పుడు చెల్లిస్తావని అతడి కుమారుడు హరీశ్‌తో కలిసి దాడికి పాల్పడ్డాడు. హన్మంత్‌ను బైక్‌పై ఇంటికి తీసుకువెళ్లి తాడుతో గుంజకు కట్టేసి కుటుంబ సభ్యులైన లక్ష్మి, శ్రీమతి, బిక్కయ్యతో కలిసి దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా పట్టివేత

భీమారం: మండల కేంద్రం సమీపంలోని కొత్తగూడెంలో మంగళవారం నెన్నెల మండలం కొత్తూరుకు చెందిన భద్రునాయక్ వద్ద 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆవిడం–భీమారం ప్రధాన రోడ్డులో కొత్తగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా భద్రునాయక్ అనుమానాస్పద స్థితిలో కనిపించగా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అతడి వద్ద ఉన్న సంచి తనిఖీ చేయగా గుడుంబా ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. నెన్నెల మండలం కొత్తూరు ప్రాంతం నుంచి భీమారానికి అతడు గుడుంబా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ హైవేపై కద్దా హోటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరుకు చెందిన షేక్ అహ్మద్ మంగళవారం బైక్‌పై వస్తుండగా, ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో షేక్ అహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు.

గుడుంబా విక్రేతకు జరిమానా

గుడిహత్నూర్: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఘులే శివాజీ గతంలో పలుసార్లు గుడుంబా విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు దొరికాడు. దీంతో తహసీల్దార్ ఎదుట అతడిని బైండోవర్ చేశారు. అయినప్పటికీ మళ్లీ గుడుంబా విక్రయిస్తూ దొరికిపోయాడు. దీంతో ఎక్సైజ్ అధికారులు అతడికి రూ.50 వేల జరిమానా విధించారు. మంగళవారం శివాజీ జరిమానా చెల్లించి దాని ప్రతిని ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు అందజేశాడు.

సాలెవాడలో ఉద్రిక్తత

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ గ్రామంలో ప్రేమజంట కారణంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ఓ వర్గానికి చెందిన అమ్మాయి మరోవర్గానికి చెందిన అబ్బాయి ప్రేమించుకున్నారు. వారి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. దీంతో వారు సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈక్రమంలో యువతి కుటుంబ సభ్యులు అబ్బాయి ఇంటి రేకులు కూలగొట్టి సామగ్రి తొలగించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా సీఐ మొగిలి, ఎస్సై మనోహర్, ఏఎస్సై రాములు గ్రామానికి వెళ్లి ఇరువర్గాలను సముదాయించారు. గ్రామంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూడో యూనిట్‌కు ముహూర్తమెప్పుడో!

- ఎస్టీపీపీలో 2015లో శంకుస్థాపన
- పనులు దక్కించుకున్న బీహెచ్ఈఎల్
- పదేళ్లయినా ప్రారంభంకాని పనులు
- ఉపాధి కోసం నిరుద్యోగుల నిరీక్షణ


కొత్త ప్లాంట్ నిర్మించనున్న ప్రాంతం

జైపూర్: పదేళ్లయినా మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో మూడో యూనిట్ ప్లాంట్ నిర్మాణం టెండర్ల దశలోనే నిలిచింది. 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను విస్తరిస్తూ రెండు యూనిట్లకు అదనంగా మూడో యూనిట్ ఏర్పాటుకు 2015 మార్చిలో అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడున్న 600 మెగా థర్మల్ పవర్ ప్లాంట్ల ఎదుట మరో 600 మెగావాట్ల ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కాలుష్య నియంత్రణలో భాగంగా సూపర్‌క్రిటికల్ విధానంతో 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు అనుమతించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నూతనంగా నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌కు అన్ని అనుమతులు పొందడానికి ఎనిమిదేళ్లు పట్టగా టెండర్లు ఖరారు కావడానికి మొత్తం 10 ఏళ్లు పట్టింది. రెండు దఫాలుగా సింగరేణి నిర్వహించిన టెండర్లలో రెండోసారి బీహెచ్ఈఎల్ కంపెనీ దక్కించుకోగా సుమారు రూ.8,500కోట్ల అంచనా వ్యయంతో కొత్త ప్లాంట్ నిర్మించనున్నారు. టెండర్ల దశకు చేరుకోవడానికి పదేళ్లు పట్టగా పనుల ప్రారంభోత్సవానికి ముహూర్తం కలిసి రావడం లేదు. ఓసారి ఉపముఖ్యమంత్రి ప్రోగ్రాం ఖరారై చివరి నిమిషంలో నేతల మధ్య వర్గపోరుతో రద్దయింది. ఉపముఖ్యమంత్రి పవర్ ప్లాంట్ సందర్శన, పలు ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉండగా వాయిదా వేసుకుని వెళ్లిపోయారు. మళ్లీ సీఎం చేతుల మీదుగా కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవం ఉంటుందని అందరూ భావించారు. గత నెలలో అధికార యంత్రాంగం సీఎం ప్రోగ్రాం ఉంటుందని హడావుడి చేసినా అది కూడా ఖరారు కాలేదు. అసలు కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవానికి సమయమే కలిసిరావడం లేదని అభిప్రాయపడుతున్నారు. కాగా, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి ఇటీవల మంత్రి వర్గంలో చోటు దక్కింది. మంత్రి హోదాలో అతడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తారని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆరు నెలలుగా కసరత్తు జరుగుతున్నా..

జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ద్వారా నిరంతరం విద్యుదుత్పత్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ కాంతులు పంచుతోంది. సింగరేణి సంస్థకు ఇక్కడి వనరులు అనుకూలించడం ప్రధానంగా అంచనాకు మించి సేకరించిన భూములతో థర్మల్ విద్యుత్ కేంద్రాలను విస్తరించే దిశగా ఆదిలోనే అడుగులు వేసింది. అందులో భాగంగానే నూతనంగా మరో 800 మెగావాట్ల ప్లాంట్‌ను రూ.8,500కోట్ల అంచనాతో నిర్మించాలని నిర్ణయించింది. కానీ, నిధుల సమీకరణలో జాప్యం చోటు చేసుకుందో?.. లేదా ఆశించిన స్థాయిలో సింగరేణి సంస్థకు ప్రభుత్వ ప్రోత్సాహం లభించిందో.. లేదో కానీ 800 మెగావాట్ల ప్లాంట్ పనులు 10 ఏళ్లుగా టెండర్ల దశలోనే నిలిచాయి. ఎట్టకేలకు మళ్లీ బీహెచ్ఈఎల్ కంపెనీ పనులు దక్కించుకోగా పనుల ప్రారంభోత్సవానికి ఆరు నెలలుగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే పవర్‌ప్లాంట్‌లో కొత్త ప్లాంట్ నిర్మించే ప్రాంతాన్ని చదును చేసి అధికార యంత్రాంగం ఎదురుచూస్తోంది. రాజకీయ నేతల మధ్య సయోధ్య కుదరకపోవడంతో అధికారిక కార్యక్రమాలూ రద్దుకావడం అంతటా చర్చనీయాంశమైంది.

ఉపాధి కోసం యువత నిరీక్షణ

ఎస్టీపీపీలో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్ పూర్తయితే ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయని స్థానిక నిరుద్యోగ యువకులు, భూనిర్వాసితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రెండేళ్లుగా కొత్త ప్లాంట్ ప్రారంభమవుతుందని అధికార యంత్రాంగం చెబుతున్నప్పటికీ దాని పనులు ప్రారంభం కాకపోవడంతో వారికి నిరాశే మిగులుతోంది. కొత్త ప్లాంట్ నిర్మాణంతో ప్రభావిత గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ఇక నిరుద్యోగ సమస్య పూర్తిగా తీరుతుందని అందరూ భావిస్తున్నారు. అయినప్పటికీ ప్లాంట్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుండడం గమనార్హం.

బస్టాండ్ బాత్రూంలో బోనోఫిక్స్ కలకలం!

- మత్తు కోసం వినియోగిస్తున్న యువత


బస్టాండ్ ఆవరణలో పడి ఉన్న బోనోఫిక్స్ కవర్లు

ఖానాపూర్: మద్యం, గుట్కాతో పాటు గంజాయి లాంటి పలు మత్తు పదార్థాలకు యువత బానిసలవుతున్న విషయం తెలిసిందే. కాగా, ఇదే తరహాలో సైకిల్ టైర్ పంక్చర్ కోసం వినియోగించే బోనోఫిక్స్‌తో ద్వారా మత్తును ఆస్వాదిస్తున్న ఘటన ఖానాపూర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు, మూత్రశాలల ప్రాంతంలో బోనోఫిక్స్ వినియోగించి పడేసిన ఖాళీ కవర్లు కనిపించాయి. ఈ ఘటన తెలియడంతో పట్టణవాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కసారిగా ఆందోళనకు గురవుతున్నారు. దుకాణాల్లో కొనుగోలు చేసిన బోనోఫిక్స్‌ను కర్చీఫ్‌లు, కవర్లలో వేసుకుని యువత మత్తు కోసం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. బోనోఫిక్స్ పీల్చడం ద్వారా ఊపిరితిత్తులు చెడిపోవడంతో పాటు ఇతర వ్యాధులు వస్తాయని, సైడ్‌ఎఫెక్ట్‌లకు దారితీసే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బోనోఫిక్స్ విక్రయాలపై నిఘా పెట్టాలని, యువతకు దురలవాట్లపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో రౌడీయిం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందరమ్మ కాలనీకి చెందిన ఓ వ్యక్తిని భయభ్రాంతులకు గురి చేసి అతడి నుంచి రూ.2వేలు లాక్కున్న బంగారుగూడకు చెందిన షేక్ సలీంతో పాటు మరో ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా భయభ్రాంతులకు గురిచేసి రౌడీయిజం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నారు.

ఐఎన్టీయూసీతోనే సమస్యలు పరిష్కారం

మందమర్రిరూరల్: సింగరేణిలో కార్మిక సమస్యల పరిష్కారం ఐఎన్టీయూసీతోనే సాధ్యమని యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నేతృత్వంలో సంస్థ సీఎండీకి విన్నవించగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. సంస్థలో విధులు నిర్వహించే ఉన్నత చదువులు చదివినవారి కోసం ప్రత్యేకంగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేయాలని కోరారు. కోర్టు కేసులను త్వరగా పరిష్కరించేందుకు యాజమాన్యం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మయ్య వెంట యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, సూర్యనారాయణ, వెంకటస్వామి, శంకర్‌రావు తదితరులున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి జైలు

వాంకిడి: గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 10 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 జూలై 14న అప్పటి ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ఖైరీట్ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో కెరమెరి మండలం ధనోర గ్రామానికి చెందిన ఎండీ గులాబ్ ఖాన్, కాగజ్‌నగర్ మండలం చిన్నమాలిని గ్రామానికి చెందిన సూర్వం జిన్కు కారులో ఏడు కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. అప్పటి సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి వారిని రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుత సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్‌మోహన్‌రావు, ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ విచారణలో నేరం రుజువైంది. దీంతో నిందితులు గులాబ్‌ఖాన్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.60వేల జరిమానా, సూర్వం జిన్కుకు 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్‌మోహన్‌రావు, సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్‌ను ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అభినందించారు.

ఆటో బోల్తాపడి ఒకరి మృతి

- ఐదుగురికి గాయాలు


రొడ్డ ముత్యం మృతదేహం

ముధోల్: మండలంలోని బోరిగాం, వడ్తాల గ్రామాల మధ్య ఆటో బోల్తా పడ్డ ఘటనలో బ్రహ్మణ్‌గావ్‌కు చెందిన రొడ్డ ముత్యం (50) మృతి చెందగా, ఐదుగురికి గాయాలైనట్లు ఎస్సై పెర్సిస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాసర మండలం కిర్గుల్(కే) గ్రామానికి చెందిన ఆటోలో మంగళవారం లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామానికి తమ బంధువు అంత్యక్రియలకు ముత్యం వెళ్లి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఆటో బోల్తా పడడంతో గాయాల పాలైనవారిని భైంసా ఏరియాస్పత్రికి తరలిస్తుండగా తీవ్రంగా గాయపడ్డ ముత్యం మార్గమధ్యలో మృతి చెందాడు. గాయపడ్డ వారిలో బాసర మండలం కిర్గుల్(కే) గ్రామానికి చెందిన బుజ్జవ్వ, కాశీ, ముధోల్ మండలంలో బ్రహ్మణ్‌గావ్ గ్రామానికి చెందిన లక్ష్మి, గంగన్న, రువ్వి గ్రామానికి చెందిన శ్యామల ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


హన్మాండ్లు (ఫైల్)

కుంటాల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. కుంటాలకు చెందిన బాస హన్మాండ్లు (58) సోమవారం రాత్రి వర్షంలోనే నిత్యావసరాల కోసం కిరాణా దుకాణానికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. తల వెనుక, ముందు భాగం బలమైన గాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. అతడి కుమారుడు గజేందర్ బతుకుదెరువు కోసం ఏడాదిన్నర క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


నాగమ్మ (ఫైల్)

భీంపూర్: మండలంలోని నిపాని గ్రామానికి చెందిన కలిమి నాగమ్మ (48) మంగళవారం పిడుగుపాటుకు గురై మృతి చెందింది. వివరాలు.. నిపాని గ్రామానికి చెందిన నాగమ్మ అత్త కర్మకాండలో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీపూర్ గ్రామ సమీపంలోని చేను వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ఒక్కసారిగా వర్షం రావడంతో బస్టాండ్ వద్ద ఆగిన సమయంలో పిడుగు పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీవాడకు చెందిన తారచాంద్ శర్మ భార్య అంకిత (40) ఈ నెల 7న ఉదయం కూరగాయలు తీసుకువచ్చేందుకు మార్కెట్‌కు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించారు. అయినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తారచాంద్‌శర్మ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

వేమనపల్లి: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయంటూ మండలంలోని కొత్తపల్లి గ్రామ రైతులు మంగళవారం తహసీల్దార్ సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సెంటర్‌లో జరిగే అవకతవకల గురించి వివరించి ఆధారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పీఏసీఎస్ ద్వారా 19 లారీల వడ్లు కొనుగోలు చేసిన నిర్వాహకులు 15 రోజులైనా రైతులకు రశీదులు, ట్రక్‌షీట్‌లు ఇవ్వలేదని ఆరోపించారు. ఇలాంటివెన్నో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. విచారణ చేపడితే అక్రమాలు బయటపడతాయని తెలిపారు. అక్రమాలపై సెంటర్ నిర్వాహకులను ప్రశ్నిస్తే రైతులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని, నిలదీస్తే బెదిరిస్తున్నారని ఆరోపించారు. బుధవారం కలెక్టర్‌ను కూడా కలిసి తమ గోడు విన్నవించుకుంటామని వారు తెలిపారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు


బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తానూరు: మండలంలోని ఝరి(బి)తండా గ్రామ శివారులో మంగళవారం పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అస్వస్థతకు గురైన బాధితులను గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా స్పత్రికి తరలించారు. తేనెటీగల దాడిలో రాథోడ్ గోవర్ధన్, హరిదాస్, సుభాష్, ధన్‌రాజ్, దేవ్‌కబాయి, శివరాజ్‌కు గాయాలయ్యాయి. బాధితులు ప్రస్తుతం భైంసా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

జీసీసీ డీఎంగా పీహెచ్‌వోకు అదనపు బాధ్యత


సందీప్‌ను సన్మానిస్తున్న జీసీసీ సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డివిజన్ మేనేజర్‌గా ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి (పీహెచ్‌వో) సందీప్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎంగా పని చేసిన వీఎల్ఎన్ ప్రసాద్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లినందున తాత్కాలికంగా సందీప్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు త్వరలో తెరుచుకోనున్న నేపథ్యంలో ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సూచన మేరకు సందీప్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సందీప్‌ను జీసీసీ సిబ్బంది గోవింద్‌రావు, లింబారావు, సత్యనారాయణ తదితరులు సన్మానించారు.

మొక్కలు తొలగించి, చెట్లు నరికి నిరసన


మైసంపేటలో మాట్లాడుతున్న భవానీశంకర్

కడెం: రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామస్తుల ఆందోళన రెండోరోజూ కొనసాగింది. మంగళవారం గ్రామస్తులు మరిన్ని గుడిసెలు వేసి అక్కడే వంట చేసుకుని మకాం వేశారు. ఉడుంపూర్ ఎఫ్ఆర్వో అనిత ఎదుటే రాంపూర్ గిరిజనులు ప్లాంటేషన్‌లో మొక్కలు తొలగించారు. చెట్లు నరికి నిరసన తెలిపారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఎఫ్‌డీవో భవానీశంకర్ ఇరు గ్రామాల గిరిజనులతో మాట్లాడినా వారు వినలేదు. తమ డిమాండ్లు నెరవేర్చేదాకా కదిలేది లేదని తేల్చిచెప్పారు.

మహిళా సమాఖ్యకే 'ట్రిపుల్‌ఐటీ యూనిఫాం'


యూనిఫాంలు పరిశీలిస్తున్న అభిలాష అభినవ్(ఫైల్)

నిర్మల్: రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ సేవలతో దూసుకుపోతున్న జిల్లా మహిళా సమాఖ్య మరో గుర్తింపును సొంతం చేసుకుంది. ఇప్పటికే స్కూల్ యూనిఫాంలను కుడుతున్న సమాఖ్య తాజాగా రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా గుర్తింపు ఉన్న బాసర ఆర్జీయూకేటీ విద్యార్థుల యూనిఫాంలనూ కుట్టించి ఇచ్చే పనిని దక్కించుకుంది. వేలాదిమంది విద్యార్థులుండే ట్రిపుల్‌ఐటీకి సంబంధించి రూ.54 లక్షల విలువైన యూనిఫాం కాంట్రాక్టు జిల్లా మహిళా సమాఖ్యకు దక్కడంపై డీఆర్డీవో విజయలక్ష్మి, సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గంగామణి హర్షం వ్యక్తంచేశారు. కలెక్టర్ అభిలాషఅభినవ్, ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్ సహకారంతో మహిళా సమాఖ్యకు ఈ గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు.

హాకీ చాంపియన్‌గా 'హైదరాబాద్'


చాంపియన్ జట్టుకు ట్రోఫీ ఇస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల విజేతగా హైదరాబాద్ జట్టు నిలిచింది. నిజామాబాద్ జట్టుతో జరిగిన పోరులో 3–0 గోల్స్‌తో విజయదుందుభి మోగించింది. రెండో స్థానంలో నిజామాబాద్, మూడో స్థానంలో నల్గొండ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ సీఆర్ భీంసింగ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, యూనుస్ అక్బాన్, రాష్ట్రపాల్, క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

- చెల్లాచెదురైన మృతదేహాలు
- దిలావర్‌పూర్‌లో విషాదం


షేక్ సానిఫ్ (ఫైల్)


షేక్ అబ్రార్ (ఫైల్)


నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి సమీపంలో నిర్మల్–భైంసా రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దిలావర్‌పూర్‌కు చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. నిర్మల్ సీఐ కృష్ణ, దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న దిలావర్‌పూర్‌కు చెందిన షేక్ అబ్రార్ (27) మంగళవారం రాత్రి షేక్ సానిఫ్ (20) తో కలిసి ద్విచక్రవాహనంపై మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల దాబాహోటల్‌కు చికెన్ తీసుకెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహాలు 200 మీటర్ల మేర చెల్లాచెదురయ్యాయి. అటుగా వెళ్తున్న ద్విచక్రవాహదారులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. నిర్మల్ సీఐ కృష్ణ, దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. షేక్ అబ్రార్ నిత్యం దాబా హోటల్‌కు చికెన్ సప్లయ్ చేస్తుంటాడని తెలిపారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు. షేక్ అబ్రార్‌కు భార్యతోపాటు ఐదేళ్లలోపు ముగ్గురు పిల్లలున్నారు. షేక్ సానిఫ్‌కు రెండు నెలల క్రితమే వివాహమైంది. వీరిరువురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో దిలావర్‌పూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

బెల్లంపల్లి: లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, బెల్లంపల్లి మండల కన్వీనర్ సీహెచ్ దేవదాస్ కోరారు. మంగళవారం బెల్లంపల్లి సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, శ్రేణులు పద్మ, అనురాధ, రాజేశ్వరి, స్వాతి, సీఐటీయూ శ్రేణులు యాకూబ్, సుమన్, నారాయణ, రవీందర్, విశ్వనాథ్, అనిల్, రాహుల్, కిశోర్ పాల్గొన్నారు.